RNI NO.TGTEL/25/A5224
జోర్దార్
JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక
అవినీతి అంతం - మా పంతం



# ఇందుర్తి జానకిరామయ్య శర్మకు
## రాష్ట్రస్థాయి గురు పురస్కారం

**హుజురాబాద్ జోర్దార్ ప్రతినిధి:** అయ్యప్ప భక్తి ప్రచారం, ధార్మిక సేవలో విశేష కృషి చేసిన హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం నేరెళ్ల గ్రామానికి చెందిన ఇందుర్తి జానకి రామయ్య శర్మకు రాష్ట్రస్థాయి ఉత్తమ గురు పురస్కారం--2026 లభించింది.
మహాశాస్త్ర సేవా సంఘం హైదరాబాద్ ఆధ్వర్యంలో చిక్కడపల్లిలోని త్యాగరాయ గానసభలో నిర్వహించిన కార్యక్రమంలో శబరిమల అయ్యప్ప స్వామి వంశస్థుడు సురేష్ శర్మ చేతుల మీదుగా ఆయన పురస్కారం అందుకున్నారు.
గత 40 ఏళ్లుగా అయ్యప్ప దీక్షను కొనసాగిస్తూ అనేకమంది శిష్యులను తీర్చిదిద్దిన జానకిరామయ్య శర్మ, పలు అయ్యప్ప పడిపూజలు నిర్వహిస్తూ భక్తి సేవలో విశేష కృషి చేస్తున్నారు. కమలాపూర్, పంగిడిపల్లి గ్రామాల్లో అయ్యప్ప దేవాలయాల నిర్మాణానికి కృషి చేసి, వాటిలో నిత్యం ధూపదీప నైవేద్యాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.
ఈ పురస్కారం తన బాధ్యతను మరింత పెంచిందని, అవార్డును తన గురువర్యులకు, శిష్యులకు అంకితం చేస్తున్నట్లు జానకిరామయ్య శర్మ పేర్కొన్నారు. పురస్కారం లభించడంపై



కుటుంబ సభ్యులు, అయ్యప్ప భక్తులు, శ్రేయోభిలాషులు ఆయనను అభినందించారు.
కార్యక్రమంలో హరిహరపుత్ర సేవా సమితి ప్రధాన కార్యదర్శి పెందోట సోము, కోశాధికారి పొట్టబత్తుల కృష్ణమూర్తి, ఆర్యన్ భజన్స్ పిల్లలమర్రి ఉపేందర్, వంగూరి మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

# జమ్మికుంటలో అరుదైన
## హైడాటిడ్ సిస్ట్ శస్త్రచికిత్స విజయవంతం

**జమ్మికుంట జోర్దార్ ప్రతినిధి:** జమ్మికుంటలోని ఆదిత్య మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో జనరల్ సర్జన్ డాక్టర్ మహిపాల్ ఆధ్వర్యంలో అరుదైన, క్లిష్టమైన హైడాటిడ్ సిస్ట్ శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించారు.
సిరిసేడు గ్రామానికి చెందిన 70 ఏళ్ల రైతుకు గతంలో కాలేయంలో హైడాటిడ్ సిస్ట్‌లకు శస్త్రచికిత్స జరిగింది. ప్రస్తుతం కాలేయంతో పాటు పొత్తికడుపులోని పెరిటోనియం ప్రాంతానికి వ్యాధి విస్తరించడంతో పలు ఆసుపత్రులు ఆపరేషన్‌కు నిరాకరించాయి.
చివరకు ఆదిత్య ఆసుపత్రిని ఆశ్రయించగా, పరీక్షల్లో కాలేయంలో సుమారు 12 హైడాటిడ్ తిత్తులు ఉన్నట్లు గుర్తించారు. పరిస్థితి క్లిష్టంగా ఉన్నప్పటికీ డాక్టర్ మహిపాల్ ఎక్స్‌ప్లోరేటరీ లాపరోటమీ ద్వారా శస్త్రచికిత్స నిర్వహించి తిత్తులను జాగ్రత్తగా తొలగించారు. పరాన్నజీవులు ఇతర ప్రాంతాలకు వ్యాపించకుండా ప్రత్యేక ఔషధాన్ని ఉపయోగించారు.
శస్త్రచికిత్స విజయవంతం కావడంతో రోగి కుటుంబ సభ్యులు డాక్టర్ మహిపాల్, ఆసుపత్రి యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు కూడా అరుదైన, క్లిష్ట





మైన శస్త్రచికిత్సలను అందుబాటులోకి తీసుకురావడమే తమ లక్ష్యమని ఆసుపత్రి వర్గాలు పేర్కొన్నాయి.

# ఉద్యోగుల ఆరోగ్య పథకం
## అమలుకు కొత్త మార్గదర్శకాలు

**జోర్దార్ ప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు నగదు రహిత వైద్య సేవలు అందించే నూతన ఉద్యోగుల ఆరోగ్య పథకం అమలుకు ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. ఎంప్లాయీస్ హెల్త్ కేర్ ట్రస్ట్ ద్వారా అర్హులైన వారికి ఉచిత వైద్య సేవలు అందించనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.
2026 జూలై 17 నుంచి మార్గదర్శకాలు అమల్లోకి రానున్నాయి. హెల్త్ కార్డుల జారీ, నెట్‌వర్క్ ఆస్పత్రుల పర్యవేక్షణ, క్లెయిమ్‌ల పరిష్కారం తదితర అంశాలను పారదర్శకంగా నిర్వహించేందుకు నిబంధనలు రూపొందించారు. పథకం అమలులో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను సీఎస్ ఆదేశించారు. నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో హెల్త్ కార్డులను నిరాకరించడం, అదనపు వసూళ్లు చేయడం వంటి సమస్యలు పునరావృతం కాకుండా కఠిన పర్య వేక్షణ అవసరమని ఉద్యోగ, పెన్షనర్ వర్గాలు కోరుతున్నాయి.

# సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా మర్రి
## రవికుమార్‌కు డాక్టరేట్

**ఎల్కతుర్తి, జోర్దార్ ప్రతినిధి:** సామాజిక సేవకుడిగా, జర్నలిస్టుగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ నిరుపేదలు, అభాగ్యులకు అండగా నిలుస్తున్న హన్మకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం బావుపేట గ్రామానికి చెందిన మర్రి రవికుమార్‌కు అరుదైన గౌరవం దక్కింది. ఆయన సేవలను గుర్తించి హైదరాబాద్‌కు చెందిన తెలుగు సంస్కృతి సాహితీ సేవా ట్రస్ట్, తెలంగాణ సంస్కృతి సాహితీ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థలు గౌరవ డాక్టరేట్ అవార్డు-2026ను అందజేశాయి. హైదరాబాద్‌లోని సిటీ పార్క్ హోటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఈ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా నిరుపేదలకు వైద్య సహాయం, అన్నదానం, రక్తదానం, అనాథాశ్రమాలకు నిత్యావసర వస్తువుల పంపిణీ లాంటి కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తున్నారు. రవికుమార్ సేవలను గుర్తించిన జీసీఎస్ వల్లూరి ఫౌండేషన్ బంగారు నంది అవార్డు-2023న రవీంద్రభారతిలో ప్రదానం చేశారు. ఈ సందర్భంగా డా. మర్రి రవికుమార్ మాట్లాడుతూ డాక్టరేట్ రావడం ఎంతో సంతోషంగా ఉందని, ఈ గౌరవం తనపై మరింత బాధ్యతలను పెంచిందన్నారు. తన తల్లిదండ్రులు స్ఫూర్తితో నిరుపేదలు, అభాగ్యుల



కు సేవ చేయాలనే భావన నాలో కలిగిందని తెలిపారు.
మర్రి రవికుమార్‌కు డాక్టరేట్ లభించడంపై బావుపేట గ్రామ ప్రజలు, మిత్రులు, శ్రేయోభిలాషులు, జర్నలిస్టు మిత్రులు హర్షం వ్యక్తం చేశారు.

# జర్నలిస్టు కాలనీకి మౌలిక సదుపాయాలు త్వరలో కల్పిస్తాం

■ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు

**వేములవాడ, జోర్దార్ ప్రతినిధి:** జర్నలిస్టు కాలనీలో మౌలిక సదుపాయాలను త్వరలోనే కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని,
ప్రజా పాలన ప్రభుత్వంలో జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉంటామని..
వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు అన్నారు. ఆదివారం మున్సిపల్ వైస్ చైర్మన్ నరాల శేఖర్, ఆరో వార్డు కౌన్సిలర్ కాస శ్రీనివాసులతో కలిసి నాంపల్లి శివారులోని జర్నలిస్టు కాలనీని వారు సందర్శించారు.
వేములవాడ మున్సిపాలిటీ పరిధిలోని ఆరో వార్డులో, నాంపల్లి శివారులో 391 సర్వే నంబర్‌లో ప్రభుత్వం జర్నలిస్టులకు నివేశన స్థలాలను కేటాయించిన విషయం తెలిసిందే. గత మూడేళ్లుగా పలువురు జర్నలిస్టులు కాలనీలో ఇళ్ల నిర్మాణాలను చేపడుతున్నారు. అయితే విద్యుత్, డ్రైనేజీ, తాగునీరు, రోడ్లు తదితర మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న



విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దృష్టికి జర్నలిస్టులు తీసుకెళ్లారు.
స్పందించిన ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ జర్నలిస్టు కాలనీని సందర్శించి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్‌ను ఆదేశించారు. ఈ నేపథ్యంలో కాలనీని సందర్శించిన పుల్కం రాజు మాట్లాడుతూ.. ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా నిలుస్తూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొచ్చే జర్నలిస్టుల కాలనీలో అవసరమైన మౌలిక సదుపాయాలను తక్షణమే కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.
వైస్ చైర్మన్ నరాల శేఖర్, ఆరో వార్డు కౌన్సిలర్ కాస శ్రీనివాసులు మాట్లాడుతూ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిశీలించి సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకొని పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.
ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం జర్నలిస్టులకు నివేశన స్థలాలను కేటాయించిందని, ప్రస్తుత ప్రభుత్వం కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల నివేశన స్థలాల సమస్యలను కూడా పరిష్కరించాలని కోరారు.
అనంతరం కార్యక్రమానికి హాజరైన మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, కౌన్సిలర్ కాస శ్రీనివాసులను ప్రెస్ క్లబ్ అధ్యక్షులు రాపల్లి శ్రీనివాస్ శాలువాలతో సత్కరించి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జర్నలిస్టు కాలనీకి చెందిన పలువురు విలేకరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల ఇళ్ల స్థలాల
## రద్దు కుట్రలను సహించేది లేదు



● అకినపల్లి శిరీష

**హుజూరాబాద్, జోర్దార్ ప్రతినిధి:** హుజూరాబాద్ జర్నలిస్టులకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిబంధనల ప్రకారం కేటాయించిన ఇళ్ల స్థలాలను రద్దు చేసేందుకు కుట్రలు జరుగుతున్నాయని బీఆర్ఎస్ నాయకురాలు అకినపల్లి శిరీష ఆరోపించారు. జర్నలిస్టుల స్థలాలపై కాంగ్రెస్ నాయకుడు గూడూరు స్వామిరెడ్డి కోర్టులో వేసిన కేసును నిరసిస్తూ చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం 8వ రోజుకు చేరుకున్నాయి.
దీక్షా శిబిరాన్ని సందర్శించిన అకినపల్లి శిరీష జర్నలిస్టులకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టులు తమ హక్కుల కోసం రోడ్డుపైకి వచ్చి పోరాడాల్సిన పరిస్థితి రావడం బాధాకరమన్నారు. అంబేడ్కర్ స్ఫూర్తితో జర్నలిస్టులు శాంతియుతంగా చేస్తున్న పోరాటానికి తమ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు.
స్వామిరెడ్డి చర్యలతో కాంగ్రెస్ పార్టీకి సంబంధం లేదంటే వెంటనే అధికారిక ప్రకటన చేయాలని, లేకపోతే ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల న్యాయమైన హక్కులను కాలరాస్తే హుజూరాబాద్‌లో మరో ప్రజా ఉద్యమం తప్పదని హెచ్చరించారు. డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, బీఆర్ఎస్ పార్టీ తరపున జర్నలిస్టులకు స్థలాలు దక్కే వరకు న్యాయపోరాటానికి అన్ని విధాలా అండగా ఉంటామని శిరీష స్పష్టం చేశారు.
ఈ కార్యక్రమంలో స్థానిక జర్నలిస్టులు, బీఆర్ఎస్ నాయకులు, అకినపల్లి శిరీష తదితరులు పాల్గొన్నారు.

# చదరంగం జీవన నైపుణ్యాలు నేర్పే ఒక కళ
## విజయవంతంగా ముగిసిన కల్లెడ చెస్ టోర్నమెంట్









**హనుమకొండ జోర్దార్ ప్రతినిధి:** ఆర్డీఎఫ్ మరియు చెస్ నెట్వర్క్ సంయుక్త నిర్వహణలో పర్వతగిరి మండలం కల్లెడలో ఆదివారం నాడు జరిగిన చదరంగం పోటీలు విజయవంతంగా ముగిసాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన 220 మంది పాఠశాల విద్యార్థులు ఈ పోటీలో పాల్గొన్నారు.
ఉదయం 9:30 గంటలకు ప్రారంభమైన పోటీలు ఆరు రౌండ్ల పాటు హోరాహోరీగా సాగాయి. విద్యార్థులు తమ వ్యూహాత్మక ఆలోచనా శక్తిని, ప్రతిభను ప్రదర్శిస్తూ పోటీలను ఆసక్తికరంగా కొనసాగించారు.
దృష్టి లోపం ఉన్న బాలురు జీవన్, చరణ్, ఒక వినికిడి--మాట్లాడే లోపం ఉన్న బాలిక కేతన ఈ పోటీలో పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రత్యేక చెస్ బోర్డులు, పావులతో వారు పోటీలో పాల్గొని స్ఫూర్తిగా నిలిచారు.
చెస్ నెట్‌వర్క్ అధ్యక్షులు సంజయ్, జనరల్ సెక్రటరీ హరితో పాటు ప్రతినిధులు రాజన్న, ఐతా శ్రీనివాస్, గంప అశోక్ తదితరులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. చీఫ్ ఆర్బిటర్ గా రజినీకాంత్ వ్యవహరించారు.
వనిత అచ్యుతపాయి జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ జనార్దన్, పీఈటీలు, పీడీలు పోటీల నిర్వహణలో చురుకుగా పాల్గొని క్రీడాకారులకు అవసరమైన సహకారం అందించారు.
ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో నిర్వాహకులు మాట్లాడుతూ.. చదరంగం కేవలం వినోదాన్నిచ్చే ఆట మాత్రమే కాకుండా, ఓపిక, ఏకాగ్రత, తార్కిక ఆలోచన, సమస్య పరిష్కార నైపుణ్యం, నిర్ణయ సామర్థ్యం వంటి జీవన నైపుణ్యాలను పెంపొందించే మేధో క్రీడ అని పేర్కొన్నారు.
చదరంగం ఆటను సాధన చేయడం ద్వారా విద్యార్థుల్లో 360 డిగ్రీల కోణంలో ఆలోచించే సామర్థ్యం అభివృద్ధి చెందుతుందని, ఇది వారి విద్యాభ్యాసానికి కూడా ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు.
ఆర్డీఎఫ్ వ్యవస్థాపకులు కల్లెడ రామ్మోహన్‌రావు క్రీడా నిర్వహణకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించి విజేతలకు మొత్తం 72,000 రూపాయలు నగదు బహుమతులు అందించారు. క్రీడాకారుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరై నిర్వాహకులు చేసిన ఏర్పాట్ల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి సంవత్సరం కల్లెడలో చదరంగం పోటీలను నిర్వహించాలని కోరారు.
డాక్టర్ పొన్నాల రామయ్య (రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్, నీటిపారుదల శాఖ), డాక్టర్ సోమన్న (ఫిజికల్ డైరెక్టర్) ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు నగదు బహుమతులు అందజేశారు.

విద్యార్థులను అభినందిస్తూ చదరంగాన్ని నిరంతరం సాధన చేయాలని, క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని వారు సూచించారు.
ఇలా ంటి పోటీలను తరచుగా నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తి, పోటీతత్వం, ఆత్మవి శ్వాసం, మేధో సామర్థ్యం మరింత పెంపొం దుతాయని పలువురు అభిప్రాయపడ్డారు.

# సోమవారం ప్రజావాణి

**వరంగల్:** జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డా. సత్య శారద తెలిపారు. జిల్లా, రెవెన్యూ డివిజన్, మండల స్థాయిలో అధికారులు ప్రజావాణి నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు. వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



# జర్నలిస్టుల ఇళ్ల స్థలాల వివాదాన్ని వెంటనే పరిష్కరించాలి

**మాజీ మంత్రి పెద్దిరెడ్డి**




**హుజూరాబాద్,జోర్దార్ ప్రతినిధి:** సమస్యలను వెలుగులోకి తెస్తూ ప్రజాసేవలో కీలకపాత్ర పోషిస్తున్న జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు నిబంధనల ప్రకారం కేటాయించిన ఇళ్ల స్థలాలపై ఏర్పడిన వివాదాన్ని పరిష్కరించి, వారికి న్యాయం చేయాలని కోరారు.హుజూరాబాద్‌లో జర్నలిస్టులకు కేటాయించిన ఇళ్ల స్థలాలపై కాంగ్రెస్ నాయకుడు గూడూరు స్వామిరెడ్డి కోర్టులో కేసు వేయడాన్ని నిరసిస్తూ జర్నలిస్టులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష శనివారం 8వ రోజుకు చేరుకుంది. దీక్షకు ముందు జర్నలిస్టులు కళ్లకు నల్ల రిబ్బన్లు కట్టుకుని అంబేడ్కర్ చౌరస్తాలో నిరసన తెలిపారు. కాంగ్రెస్ పార్టీతో పాటు గూడూరు స్వామిరెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

అనంతరం దీక్షా శిబిరాన్ని మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి సందర్శించి జర్నలిస్టులకు సంపూర్ణ సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టాలు పొందిన పలువురు జర్నలిస్టులు తమ స్థలాల్లో ఇల్లు నిర్మించు కొంటున్న సమయంలో కోర్టు కేసు కారణంగా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి రావడం అన్యాయమన్నారు.ప్రజా సమస్యలపై గళమెత్తే జర్నలిస్టులు తమ హక్కుల కోసం రోడ్డుపైకి వచ్చి దీక్షలు చేయాల్సిన పరిస్థితి రావడం బాధాకరమని పెద్దిరెడ్డి అన్నారు.

బాధ్యులైన నాయకులతో పాటు జర్నలిస్టులను చర్చలకు పిలిచి వివాదాన్ని తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు జర్నలిస్టుల వెన్నంటే ఉంటానని స్పష్టం చేశారు.

కాగా, జర్నలిస్టుల రిలే నిరాహార దీక్షలకు పీవీ సేవా సమితి కూడా సంపూర్ణ మద్దతు ప్రకటించింది.

ఈ కార్యక్రమంలో పీవీ సేవా సమితి నాయకులు బి. మనోజ్ కుమార్, తూము వెంకట్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకురాలు అకినపల్లి శిరీషతో పాటు పలువురు జర్నలిస్టులు, నాయకులు, మద్దతుదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బీఆర్ఎస్,బీజేపీ పార్టీలకు బిగ్ షాక్



- ఇంచార్జి వొడితల ప్రణవ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన నేతలు

**జమ్మికుంట జోర్దార్ ప్రతినిధి:** కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై జమ్మికుంట మండలం విలాసాగర్ గ్రామం నుండి పెద్ద ఎత్తున బీఆర్ఎస్,బీజేపీ పార్టీలకు చెందిన నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు.వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు ప్రణవ్.అనంతరం వారు మాట్లాడుతూ ఒకవైపు సంక్షేమపథకాలు,మరొకవైపు అభివృద్ధి రెండు సమపాళ్ళలో ప్రభుత్వం అందిస్తుందని,నియోజవర్గంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు,అభివృద్ధి ప్రజలకు ఇంచార్జి గా ప్రణవ్ బలంగా తీసుకువెళ్తున్నారని వారి ఆధ్వర్యంలో పని చేయడానికి ముందుకు వచ్చామని తెలిపారు.

అనంతరం ప్రణవ్ మాట్లాడుతూ సంక్షేమ పథకాలు స్థానిక నాయకులతో కలిసి ప్రజలకు చేరవేస్తామని,మరిన్ని నిధులు తీసుకొచ్చి హుజురాబాద్ అభివృద్ధికి తోడ్పడతామని అన్నారు.ఈ కార్యక్రమంలో డిసిసి ఉపాధ్యక్షుడు సదానందం,మండల అధ్యక్షుడు పరశురామ రావు, గ్రామ శాఖ అధ్యక్షుడు శ్రీనివాస్,యాదవ సంఘం మండల అధ్యక్షుడు శ్రీనివాస్,డివైసి సెక్రటరీ సజ్జు,యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సాగర్,ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు భాస్కర్,వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# చెదరని స్నేహబంధం
## మిత్రుడి కుటుంబానికి రూ.20 వేల చేయూత



**హుజూరాబాద్, జోర్దార్ ప్రతినిధి:** చిన్ననాటి స్నేహానికి కాలంతో సంబంధం లేదని నిరూపిస్తూ 1991 ఏడో తరగతి బ్యాచ్‌కు చెందిన మిత్రులు గత 15 ఏళ్లుగా ఆపదలో ఉన్న స్నేహితులకు ఆర్థికంగా అండగా నిలుస్తున్నారు. మిత్రుల్లో ఎవరికైనా కుటుంబపరంగా లేదా ఆర్థికంగా ఇబ్బంది ఎదురైతే తమ వంతు సహాయం అందిస్తూ మానవతా విలువలను చాటుతున్నారు. ఇదే క్రమంలో చిన్ననాటి మిత్రుడు కొండపర్తి రాజేందర్‌కు చెందిన లో బోర్నపల్లి కుటుంబానికి ఆదివారం రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని బ్యాచ్ మిత్రులు అందించారు. కష్టకాలంలో మిత్రుడి కుటుంబానికి అండగా నిలవడమే నిజమైన స్నేహమని వారు పేర్కొన్నారు.

# జర్నలిస్ట్ పై అక్రమ కేసు ఉపసంహరించాలి



- ఆర్టీఐలో అక్రిడిటేషన్ జాబితా అడిగినందుకే కక్ష సాధింపు సరికాదు
- రాష్ట్ర స్వర్ణకార సంఘం అధ్యక్షుడు వింజమూరి రాఘవచారి.

**(నిజామాబాద్ జోర్దార్ ప్రతినిధి):** నిజామాబాద్: జిల్లాకు చెందిన సీనియర్ జర్నలిస్ట్ డి. ఎల్. ఎన్.చారిపై నమోదు చేసిన కేసును వెంటనే ఉపసంహరించుకోవాలని రాష్ట్ర స్వర్ణకార సంఘం అధ్యక్షుడు రాఘవచారి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయనకు వినతిపత్రం అందజేసి, జర్నలిస్టులకు జరుగుతున్న ఇబ్బందులు, వేధింపుల విషయాన్ని రాష్ట్రస్థాయిలో అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.

ఈ సందర్భంగా రాఘవచారి మాట్లాడుతూ, కేసుల నమోదులో కక్ష సాధింపు ధోరణి కనిపిస్తోందని ఆరోపించారు. జర్నలిస్టులు తమ వృత్తి బాధ్యతల్లో భాగంగా పనిచేస్తున్న సమయంలో వారిపై తప్పుడు కేసులు నమోదు చేయడం సరికాదన్నారు. సమాచార హక్కు చట్టం కింద జర్నలిస్టుల అక్రిడిటేషన్ జాబితాను కోరినందుకే డి. ఎల్. ఎన్.చారిపై కక్షతో కేసు నమోదు చేశారనే ఆరోపణలను ఆయన ప్రస్తావించారు. అక్రిడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియలో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు ఉన్న నేపథ్యంలో, ఆ వివరాలను ఆర్టీఐ ద్వారా కోరడం జర్నలిస్టు హక్కు అని అన్నారు. ప్రజా ప్రయోజనానికి సంబంధించిన సమాచారాన్ని కోరినందుకు జర్నలిస్టుపై కేసు నమోదు చేయడం భావప్రకటన స్వేచ్ఛను, సమాచార హక్కు స్ఫూర్తిని దెబ్బతీస్తుందని పేర్కొన్నారు.

డి. ఎల్. ఎన్.చారి కుటుంబానికి తమ సంఘం అండగా ఉంటుందని రాఘవచారి స్పష్టం చేశారు. ఈ విషయాన్ని త్వరలో రాష్ట్రస్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్తామని, అవసరమైతే డీజీపీ, ముఖ్యమంత్రిని కలిసి జర్నలిస్టులపై నమోదైన కేసులు, డిపిఆర్ఓ వేధింపుల అంశాన్ని ప్రస్తావిస్తామని తెలిపారు. వేధింపులు ఆపకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపట్టడానికి కూడా సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు.

జర్నలిస్టులు తమ వృత్తి నిర్వహణలో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం, అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. చారి పై నమోదైన కేసును తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి చేపూరి వెంకటస్వామి, రాగిపని సతీష్ చారి, అఖిల భారతీయ విశ్వకర్మ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీరామ్ మహిపాల్ చారి. జిల్లా అధ్యక్షుడు తంగేనపల్లి శ్రీనివాస్, నర్సింహాచారి, టౌన్ ప్రెసిడెంట్ సదానంద్ చారి, , తదితరులు పాల్గొన్నారు.

# భయాందోళనలో రాజాపూర్ భూనిర్వాసితులు

- సింగరేణి బ్లాస్టింగ్‌తో ఇళ్లకు పగుళ్లు..
- భూమి కుంగిపోతుండటంతో ఆందోళన





**రామగిరి జోర్దార్ ప్రతినిధి:** ఆర్‌జీ–3 పరిధిలోని ఓసీపీ–2 ప్రధాన భూనిర్వాసిత గ్రామమైన రాజాపూర్‌లో సింగరేణి బ్లాస్టింగ్‌తో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. గ్రామానికి కేవలం 50 మీటర్ల దూరంలోనే క్వారీ ఉండటంతో ప్రతిరోజూ జరుగుతున్న బ్లాస్టింగ్ ప్రకంపనలు ఇళ్లపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.బ్లాస్టింగ్ కారణంగా ఇళ్ల గోడలకు పగుళ్లు ఏర్పడుతున్నాయని, కొన్ని చోట్ల గోడలు కూలిపోయాయని గ్రామస్తులు చెబుతున్నారు. ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న ప్రాంతంలో భూమి కుంగిపోవడం మరింత ఆందోళన కలిగిస్తోందని తెలిపారు.రెవెన్యూ అధికారులు ఆర్‌పీఎన్–3 కేటాయించిన సిద్ధం కుమార్ ఇంటి గోడ కూడా బ్లాస్టింగ్ ప్రభావంతో కూలిపోయిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇంటి లోపల భూమి కుంగిపోవడంతో పాటు సుమారు ఐదు మీటర్ల లోతు వరకు ఇనుప రాడ్డు భూమిలోకి దిగిపోతున్న పరిస్థితి ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియక ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని జీవిస్తున్నామని రాజాపూర్ గ్రామస్తులు అంటున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి బ్లాస్టింగ్ ప్రభావంపై సమగ్ర పరిశీలన చేపట్టి, ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలని, నష్టపోయిన బాధితులకు న్యాయం చేసి శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

# ఎఫ్ఎఫ్ఎస్ యాప్‌లోనే ఎరువుల విక్రయాలు



**హుజూరాబాద్, జోర్దార్ ప్రతినిధి:** ఎరువుల కొనుగోలు విధానంలో మార్పులు తీసుకొచ్చినట్లు హుజూరాబాద్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకురాలు జి. సునీత తెలిపారు. ఈనెల 21 నుంచి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్రేమ్ వర్క్ ఫర్ ఫర్టిలైజర్ సేల్స్ (ఎఫ్ఎఫ్ఎస్) యాప్ ద్వారా అన్ని రకాల ఎరువుల విక్రయాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.కొత్త విధానంతో రైతులు జిల్లాలోని ఏ మండలంలోనైనా తమకు అవసరమైన యూరియా, ఇతర ఎరువులను కొనుగోలు చేసుకోవచ్చని తెలిపారు. ఎకరానికి రెండు బస్తాల చొప్పున యూరియా అందిస్తామని, వానాకాలంలో ఇప్పటికే కొనుగోలు చేసిన బస్తాలను మినహాయించి అర్హత మేరకు మిగిలిన ఎరువులను అందిస్తామని వివరించారు. ఎరువుల కొనుగోలుకు 20 రోజుల వ్యవధి ఉంటుందని తెలిపారు.ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకున్న రైతులు మాత్రమే ఎఫ్ఎఫ్ఎస్ యాప్‌లో నేరుగా ఎరువులు కొనుగోలు చేయడానికి అవకాశం ఉంటుందని సునీత తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసుకోని రైతులు వెంటనే మీ సేవ కేంద్రం లేదా సంబంధిత ఏఈఓను సంప్రదించాలని సూచించారు.యూరియా, కాంప్లెక్స్ ఎరువులు తగినంతగా అందుబాటులో ఉన్నందున రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సునీత స్పష్టం చేశారు.

# నేడు ప్రజావాణి కార్యక్రమం



**హనుమకొండ, జోర్దార్ ప్రతినిధి:** ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్, హనుమకొండ, పరకాల ఆర్డీవో కార్యాలయాలు, ఆయా మండల తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి వినతులు, అర్జీలను స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. అందిన దరఖాస్తులను పరిశీలించి, సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటారని తెలిపారు.

జిల్లా కలెక్టరేట్, ఆర్డీవో, మండల కార్యాలయాల్లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ చాహత్ బాజ్ పాయి కోరారు.

# అరవింద్ వ్యాఖ్యలను ఖండించిన మాజీ మేయర్ సంజయ్

- సీఎం రేవంత్‌రెడ్డిపై వ్యక్తిగత వ్యాఖ్యలు సరికాదు



**నిజామాబాద్, జోర్దార్ ప్రతినిది:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై ఎంపీ అరవింద్ ధర్మపురి చేసిన అనుచిత, అహంకారపూరిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు నిజామాబాద్ నగర మాజీ మేయర్ సంజయ్ తెలిపారు.

ఆదివారం తన నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..

ప్రజాస్వామ్యంలో రాజకీయ, విధానపరమైన విమర్శలు చేయాలి కానీ వ్యక్తిగతంగా, శారీరక ఆకృతిని కించపరిచేలా మాట్లాడటం సరికాదన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజాబలంతో గెలిచిన నాయకుడని, వ్యక్తిగత విమర్శలతో ఆయన ప్రతిష్ట తగ్గదన్నారు.

తెలంగాణ సంస్కృతిలో వ్యక్తిగత దూషణలకు తావులేదని పేర్కొంటూ, ఎంపీ అరవింద్ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని ముఖ్యమంత్రి, తెలంగాణ ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

# ప్రగతి ఫలాలు ప్రతి గడపకు
## ఇంటింటికి అందజేస్తా



- వొడితల ప్రణవ్..
- సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన వొడితల ప్రణవన్న...

**(వీణవంక జోర్దార్ ప్రతినిధి):** సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న క్రమంలో గంగారం గ్రామంలో ప్రజాలతో అప్యాంగ మట్లాడి ప్రభుత్వ పథకాల అమలు ప్రజా ప్రభుత్వం చేసే పనులు ప్రజలు చాలా సంతోషంగా వచ్చే ఎన్నికల లో కాంగ్రెస్ మల్లి గెలవడం పక్కా అని అన్నారు . గ్రామం లో ప్రతి సమస్య పరిస్కారిస్తానన్నారు. హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్. శనివారం రోజున వీణవంక మండలం గంగారం గ్రామశీ లో 2 లక్షల విలువ చేసే 7 చెక్కులను నేరుగా లబ్ధిదారుల ఇంటి,ఇంటికి వెళ్లి పంపిణీ చేశారు. ఇంటి ఇంటికి వెళ్తున్న క్రమంలో ఆపద,కష్ట సమయంలో మమ్మల్ని ఆదుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలుపుతూ తమ సంతోషాన్ని తెలిపారు.అనంతరం మాట్లాడుతూ గడిచిన రెండున్నర సంవత్సరాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి ఇంటికి సంక్షేమం,అభివృద్ధి అందజేస్తున్నామని దాంతోపాటు పరిస్థితి బాగోక ఆసుపత్రుల పాలైన వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి ఆసరగా నిలుస్తున్నామని అన్నారు.

ఈ కార్యక్రమంలో వీణవంక మండల అధ్యక్షుడు రఘుపాల్ రెడ్డి,సీనియర్ నాయకులు సాయి భూషణ్,గంగాడి తిరుపతి రెడ్డి, గంగారం వార్డ్ సభ్యులు నల్ల ఈశ్వర్ రెడ్డి కోమల, మడికొండ రాజమల్లు, పొన్నాల శ్రీనివాస్ , పుల్లూరి పద్మ, సీనియర్ నాయకులు, అంబటి పుల్లేందర్ రెడ్డి, మేర్గవేణి రాజు యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సాగంటి చంద్రశేఖర్ గాజుల నాగరాజు, సందీప్, కిరణ్, రాజు, అనుభవ్ పాల్గొన్నారు.

